క్లుప్తంగా

కృష్ణయ్య మాస్టారుకి ఎమ్మెల్యే ఘననివాళి



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని విష్ణుకుండినగర్‌లో విశ్రాంత తెలుగు పండిట్ సీవీ కృష్ణయ్య మాస్టారు మృతదేహాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంతోమందికి ఉన్నతమైన విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత శిఖరాలకు మార్గాలు చూపి ప్రోత్సహించిన కృష్ణయ్య మాస్టార్ మృతి చాలా బాధాకరమని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన ప్రముఖులు, ఉపాధ్యాయులు, రాజకీయ నేతలు, పలు ప్రజాసంఘాల నేతలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

విఘ్నేశ్వరుడికి రూ.88 వేల ఆదాయం



నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులో కొలువై యున్న శ్రీ నంది కుంట విఘ్నేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వార్షికోత్సవ వేడుకలు జరిగిన విషయం విదితమే. ఈ సందర్భంగా దేవదాయశాఖ ఈవో తులసీదాస్, గ్రామపెద్దలు, పూజారి సమక్షంలో మంగళవరం హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించారు. హుండీ ఆదాయం రూ.70,180లు కాగా, విరాళాలు రూపంలో రూ.18,200లు ఆలయానికి ఆదాయం సమకూరింది. స్వామివారి ఆదాయం రూ.88,380లుగా లెక్కింపుగా వచ్చినట్లు ఈవో తులసీదాస్ తెలిపారు.

ఘనంగా ఏజెంట్స్ వృత్తి పరిరక్షణ దినోత్సవం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఏజెంట్స్ వృత్తి పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ లక్ష్మానాయక్ మాట్లాడుతూ ఏజెంట్స్ కార్పొరేషన్‌కి మూల స్తంభాలని, ఏజెంట్స్ పాలసీదారులకు కార్పొరేషన్‌కి వారధులుగా పనిచేస్తున్నారని కొనియాడారు. అనంతరం సీనియర్ ఏజెంట్స్‌ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పెద్దారావు, లియాఫీ ప్రెసిడెంట్ చెరుకూరి హరనాథ్‌బాబు, ఏబీఎం వెంకటేశ్వరరావు, లియాఫీ నాయకులు కోటి రామ్మూర్తి, కోటేశ్వర రావు, ఏడుకొండలురెడ్డి, మాదాల హనుమంత రావు, ఏజెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు



వినుకొండ (నూజెండ్ల): స్థానిక మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్ హుస్సేన్ ఆదేశాలతో వినుకొండ పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గల గుమ్మడి వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సును బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆరె సామ్రాజ్యం అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమం, రక్షణ చట్టం గురించి వృద్ధులకు తెలియజేశారు. అనంతరం వృద్ధులకు బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కర్నాటి చెన్నకేశవ రెడ్డి, రమణారెడ్డి, చిరంజీవి, నాగరాజు, కోర్టు సిబ్బంది, ఆశ్రమం నిర్వాహకులు గుమ్మడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇరువురు సూపర్‌వైజర్లు బాధ్యతలు స్వీకరణ

శావల్యాపురం: ఇరువురు అంగన్‌వాడీ కార్యకర్తలకు పదోన్నతిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లుగా ప్రభుత్వం నియామకం చేసినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలో 46 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా కారుమంచి సెక్టారు సూపర్‌వైజరుగా గుర్రం శేషకుమారి ప్రకాశం జిల్లా త్రిపురాంతరం మండలం మేడపి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. శావల్యాపురం సెక్టారు సూపర్‌వైజరుగా శ్రీలత బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఈమండలంలో రెండు సెక్టార్లు పరిధిలో ఇరువురు బాధ్యతలు స్వీకరించారన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'గడప గడపకు' కార్యక్రమం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ముప్పాళ్లలో పర్యటించిన ఎమ్మెల్యే



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అభివృద్ధి ఫలాలు ఏ విధంగా ప్రజలకు అందుతున్నాయనేది తెలుసుకునేందుకే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో మంగళవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరై ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ నవరత్న పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిందని తెలిపారు. ఏ రూపాన అందుతున్నాయో కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. అమ్మఒడి, కాపు నేస్తం, చేయూత వంటి వినూత్న పథకాలు పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. అలాగే సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, మండలస్థాయి అధికారులందరూ అందుబాటులో ఉన్నారు కనుక తక్షణమే పరిష్కారం లభిస్తుందన్నారు.

నవరత్న పథకాలు తూ.చ తప్పకుండా ప్రజలకు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు పిచ్చిపట్టినట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

అలాగే ఇక్కడ వినుకొండలో జీవీ ఆంజనేయులు కూడా అలాగే తయారయ్యారని, తెలిసీ తెలియని మిడిమిడి జ్ఞానంతో ఏం మాట్లాడుతున్నాడో తనకే అర్థం కావడం లేదని అన్నారు. మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని, వినుకొండ పట్టణాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే జీవీ చూసి ఓర్వలేక కోర్టుల్లో కేసులు వేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు కార్యక్రమంలో జడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య, మండల పార్టీ అధ్యక్షులు కోపెల దేవరాజ్, గ్రామసర్పంచ్ బయ్యవరపు రమ్య రవికుమార్, సొసైటీ అధ్యక్షులు బొల్లా బుజ్జి, గోనుగుంట్ల వెంకట హనుమయ్య, శాకమూరి బుచ్చయ్య, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ముప్పాళ్ల విద్యార్థినులు




జట్టుకు ఎంపికైన విద్యార్థినులు

ఈపూరు:మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో ఎంపీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న సీహెచ్. శైలజ, బీపీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న వి.హరితబాయి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు మంగళవారం తెలిపారు. వీరిరువురు ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు చెన్నైలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు వివరించారు. ఎంపికైన క్రీడాకారిణీలను ప్రిన్సిపాల్‌తో పాటు సెక్రటరీ మేదరమెట్ల రామశేషగిరిరావు, కళాశాల అధ్యాపకులు వై.సురేష్, బలరాంనాయక్, ఎం.దాస్, ఎం.సురేష్‌లు అభినందించారు.

భద్రతా నియమాలు పాటించకే ప్రమాదాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంవీఐ నాగలక్ష్మి

చిలకలూరిపేట: భద్రతా నియమాలు పాటించటం ద్వారానే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ టీవీ నాగలక్ష్మి చెప్పారు. జాతీయ రహదారి వారోత్సవాల్లో భాగంగా ఏఎంజీ విద్యాసంస్థల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం, మద్యం సేవించి నడపటం ప్రమాదాలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయని చెప్పారు. హెల్మెట్ లేకుండా అధిక వేగంతో వాహనాలు నడుపుతున్న కారణంగా ప్రాణాపాయాలు సంభవిస్తున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ మహంతి, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థిని



సాయిలక్ష్మిని అభినందిస్తున్న పాలకవర్గ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల తైక్వాండో పోటీలలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థిని ఎం.ఎం.అంజలీ సాయిలక్ష్మి బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూధనరావు మంగళవారం తెలిపారు. గుంటూరుజిల్లా రేపల్లెలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో సాయిలక్ష్మి పల్నాడుజిల్లాకు ప్రాతినిధ్యం వహించి 44 కేజీల విభాగంలో ప్రథమ స్థానం సాధించటంతోపాటు ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు బెంగుళూరులో జరగనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. సాయిలక్ష్మిని కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కె.విజయకుమార్, ఎస్.సుబ్బరాయ గుప్త, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, అధ్యాపకులు అభినందించారు.

ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

- ఉపవిద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు



పోటీలను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు, నిర్వాహకులు

సత్తెనపల్లి: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని సత్తెనపల్లి ఉపవిద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వరరావు అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాల, బాలికల అండర్ –14, అండర్ –17 కరాటే జిల్లా జట్ల ఎంపిక సత్తెనపల్లి ప్రగతి స్కూల్లో మంగళవారం జరిగింది. ఉమ్మడి జిల్లాలైన గుంటూరు, బాపట్ల, పల్నాడు ప్రాంతాల నుంచి 150 మందికి పైగా బాల, బాలికలు కరాటే పోటీలకు వారి కరాటే కోచ్ లతో హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఉపవిద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ముఖ్యమేనని, ప్రతి ఒక్కరూ తనను తాను కాపాడుకోడానికి కరాటే ఎంతో ముఖ్యమన్నారు. ప్రగతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ మక్కెన అచ్చయ్య మాట్లాడుతూ సమయస్ఫూర్తిని అలవర్చుకొని క్రీడల్లో రాణించాలని, క్రమశిక్షణతో కూడిన విద్యార్థులు విజయం సాధిస్తారన్నారు. ప్రగతి విద్యాసంస్థల కరస్పాండెంట్ మక్కెన పద్మజ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫిజికల్ డైరెక్టర్ దాసరి కోటేశ్వరరావు, పల్నాడు జిల్లా కరాటే సెక్రెటరీ రామయ్య, సత్తెనపల్లి కరాటే ఫౌండర్ రాంబాబు, బ్లాక్ బెల్ట్ కోచ్ హసీనా (మంగళగిరి), కోచ్ కిరణ్, కేల్ ఇండియా కో ఆర్డినేటర్ లాకు పిచ్చయ్య, ఎర్ర నాగేశ్వరావు (బాపట్ల), ఫిజికల్ డైరెక్టర్ పుచ్చకాయల శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారుల సంక్షేమానికి నిధులు ఖర్చు చేయాలి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ

సత్తెనపల్లి: బడ్జెట్‌లో కేటాయించిన నిధులు వృత్తిదారుల సంక్షేమానికి ఖర్చు చేయాలని, విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం(ఎంబివికె) ఆడిటోరియంలో ఈ నెల 30న జరిగే చేతి వృత్తిదారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో కరపత్రాలు మంగళవారం ఆవిష్కరణ చేశారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సభ్యులు కంచర్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చేతివృత్తుల నుంచి వృత్తిదారులను దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్నాయని ఆయన విమర్శించారు ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలను వలన చేతి వృత్తులన్నీ ధ్వంసం అవుతున్నా యని అన్నారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పథకాన్ని, రాష్ట్రీయ వికాస్ పథకం,బెడ్ పాలక్ బీమా యోజన పథకాలను రద్దు చేసిందన్నారు. బడ్జెట్ నిధుల కేటాయింపులలో కోత విరుస్తున్నాయన్నారు.

సామాజిక,రక్షణ ప్రమాద బీమా అమలు,సబ్సిడీలతో కూడిన రుణాలు మంజూరు చేయుటకు బడ్జెట్లో నిధులు కేటాయించి ఖర్చు చేయాలని కోరుతూ ఈనెల 30న ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ రాఘవయ్య పార్కు ఎదురుగా ఉన్న మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే చేతి వృత్తిదారుల రాష్ట్ర సదస్సుకు వృత్తిదారులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా శివదుర్గారావు, అనుముల వీర బ్రహ్మం, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, గుంటుపల్లి బాలకృష్ణ,ఎం.నాగార్జున పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

నకరికల్లు: నిరుద్యోగ యువతీయువకులకు ఉచితంగా శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఏపీఎం సునీత మంగళవారం తెలిపారు. 18 నుంచి 35ఏళ్లలోపు వయస్సు కలిగిన యువతీయువకులకు నరసరావుపేట సమీపంలోని టీటీడీసీ కోటప్పకొండలో సూపర్‌వైజర్–సైట్ ఈహెచ్ఎస్ కోర్సులో నాలుగునెలల పాటు వసతి, భోజనంతో కూడిన ఉచిత శిక్షణనిస్తారన్నారు. నూరుశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉన్నందున నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు : 9908482907 నంబరును సంప్రదించాలన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

శావల్యాపురం: ఇంటి పన్నులు వసూలు వేగవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటి పన్నులు వసూలపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో నేటి వరకు 25 శాతం వసూలు చేశారని, ఫిబ్రవరి నెలఖారుకల్లా నూరుశాతం వసూలు చేయాలన్నారు. ఈనెల 26న జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలు అన్నీ గ్రామ సచివాలయాల్లో తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈసమావేశంలో ఈవోపీఆర్‌డి పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాలు వితరణ

శావల్యాపురం: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పేట్లు దాత వితరణ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దాత యం. కృష్ణారావు ప్రస్తుతం మండలంలోని బొందిలిపాలెం గ్రామం ఎంపీపీ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారని, తన సతీమణి జ్ఞాపకార్థం రూ. 5 వేలు విలువ చేసే స్టీలు ప్లేట్లు వితరణ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.శేషుగోపాలం, కాజా రాంబాబు, శంకరరావు, పీఈటి అంకారావు సీఆర్‌పీ ఎలికా శ్రీనివాసరావులు ఉన్నారు.

చెకుముకిలో సత్తాచాటడం అభినందనీయం

ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు



విద్యార్థులను అభినందిస్తున్నఎమ్మెల్సీ లక్ష్మణరావు

నాదెండ్ల: విద్యార్థులు అన్ని రంగాల్లో విజయం సాధించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు చెప్పారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కడపలో జరిగిన రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రా చలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న విషయం విదితమే.

ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రథమ బహుమతి సాధించి నాగ యశ్వంత్, సాత్వి క, కార్తిక్ రెడ్డిలతో పాటూ వీరికి తర్ఫీదు నిచ్చిన ఉపాధ్యాయులు కె.వి. రమణ, వై.శ్రీనివాసరావుల ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఒక్కో విద్యార్థికి రూ.3 వేలనగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రస్థాయిలో 52 టీంలు పాల్గొనగా, ఇందులో అన్ని అంశాల్లో ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రథమస్థానాన్ని కైవ సం చేసుకోవటం అభినందనీయమన్నారు. ఈ పా ఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు వలస కార్మికుల పిల్లలు కావటం విశేషమని, వీరికి ప్రతి అంశంలో ఉపాధ్యాలయు తర్ఫీదునివ్వాలని, చదువుతో పాటూ ఆటల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, గుంటూరు జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు దార్ల బుచ్చిబాబు, డివిజన్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, చుక్కా విన్సెంట్‌పాల్, కె.రాజాబాబు, హెచ్ఎం గురులింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను స్వాధీనం చేసుకోవాలి

ముస్లిపల్ చైర్మన్ షేక్ రఫాని



మాట్లాడుతున్న షేక్ రఫాని

చిలకలూరిపేట: టిడ్కో లబ్ధిదారులు సంబంధిత గృహాలను వెంటనే స్వాధీనం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కోరారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో టిడ్కో లబ్ధిదారులు, మెప్మా సిబ్బందికి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి అయిన లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయాలని చెప్పారు. మెప్మా సిబ్బంది ఫోన్ చేసిన వెంటనే లబ్ధిదారులు తమ పేరున రిజిస్టర్ అయిన ప్లాట్‌కు సొంత తాళాలు వేసుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకూ విద్యుత్ కనెక్షన్ పొందని వారి కోసం విద్యుత్ అధికారులు గృహ సముదాయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారని చెప్పారు. సబ్సిడీపై కేవలం రూ. 450కు విద్యుత్ మీటర్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వసతులు కల్పించటం జరిగిందని,ఇంకా లబ్ధిదారులు కోరిన పక్షంలో అదనపు సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. దీని కోసం లబ్ధిదారులు ముందు గృహాల్లో చేరాల్సి ఉంటుందన్నారు. స్కూల్ బస్సు, ఆటో సౌకర్యం వంటివి కల్పిస్తామన్నారు. ఇళ్లను ఉపయోగించని పక్షంలో అవి తిరిగి మరమ్మతులకు లోనయ్యే అవకాశం ఉంటుందన్న విషయాన్ని గుర్తించి నివాసం ఉండే ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, షేక్ బాజి, మెప్మా సీఎంఎం మాలతి పాల్గొన్నారు.

తైక్వాండో విజేతలకు ఎస్పీ అభినందన

నరసరావుపేట: తైక్వాండో నేషనల్ బ్రాంజ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు అనన్య సాహూ, రామిశెట్టి రుత్వీక్‌లను జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. జనవరి 19,20,21తేదీల్లో తమిళనాడులోని తిరుచ్చినకోడ్ కేఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్‌లో ఇండియా తైక్వాండో ఆధ్వర్యంలో తైక్వాండో నేషనల్ చాంపియన్‌షిప్ నిర్వహించారు. ఈ పోటీలకు ఏపీ నుంచి సబ్ జూనియర్స్, క్యాడెట్ బాలబాలికల విభాగంలో 21మంది హాజరుకాగా, నరసరావుపేట కాంచన తైక్వాండోకు చెందిన ఏడుగురు విద్యార్థులు హాజరయ్యారు. వారిలో సబ్ జూనియర్స్ బాలికల అండర్–26కేజీల విభాగంలో అనన్య సాహూ బ్రాంజ్ మెడల్ సాధించగా, సబ్ జూనియర్స్ బాలురు అండర్–41కేజీల విభాగంలో రామిశెట్టి రుత్వీక్ బ్రాంజ్ మెడల్ సాధించాడు. వారిద్దరినీ ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ బిందుమాధవ్‌లు అభినందించారు. బాలబాలికలకు చదువుతో పాటు క్రీడలు అవసరమని, భవిష్యత్‌లో వారు సాధించే మెడల్స్‌తో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. తైక్వాండో కోచ్ రవిశంకర్, అకాడమీ డైరెక్టర్ కాంచన, తల్లిదండ్రులను అభినందించారు.

ఆడపిల్లల చదువును ప్రోత్సహిద్దాం

డీఈవో వెంకటప్పయ్య



చిలకలూరిపేటలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో సొసైటీ సభ్యులు

నాదెండ్ల: సమాజంలో సగభాగమైన ఆడపిల్లలను చదువు, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో అగ్రపధాన రాణించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పల్నాడు జిల్లా డీఈవో వెంకటప్పయ్య చెప్పారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం జరిగిన జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రేవతి, ప్రిన్సిపల్ మాధవిలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యడ్లపాడులో....

యడ్లపాడు: సమాజంలో లింగ వివక్ష చూపకుండా సమాన విద్యను అందించినపుడే బాలికలు ఉన్నతంగా అన్ని రంగాల్లోనూ స్వేచ్ఛగా రాణిస్తారని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్‌తో పాటు రెవెన్యూ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని ప్రధాన వీధులలో ఫ్లెక్సీతో విద్యార్థులు, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో బాలికా దినోత్సవ అవగాహన ప్రదర్శన చేశారు. మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో....

బొల్లాపల్లి: మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఎంపీపీ బత్తి రాములు అన్నారు. మండలంలోని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్లో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా మహిళలకు అధిక ప్రాధాన్యత లభిస్తుందని, అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి మాట్లాడుతూ కృషి, పట్టుదలతో ఉన్నతస్థానాన్ని అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయినీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో....

మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో , గ్రామసచివాలయంలో జాతీయ బాలికల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.శ్రీదేవి, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె.అపర్ణలు మాట్లాడుతూ బాలికల దినోత్సవ ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు, సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

నూజెండ్లలో....

వినుకొండ(నూజెండ్ల): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో ఎస్‌కే జిలానీబాషా పాల్గొని మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. జాతీయ బాలిక దినోత్సవం గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.అన్నపూర్ణమ్మ వివరించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ వంగూరి అనంతప్రసాద్, ఉపాధ్యాయులు సుభాష్‌చంద్రరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: బాలిక విద్య ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమౌతుందని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు మండల విద్యాశాఖాధికారి మద్దికుంట సాంబశివరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు గుర్రం శేషకుమారి, ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం జాతీయ బాలికదినోత్సవ వేడుకలు నిర్వహించారు. మండలంలో రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం , ఎడ్వర్డ్‌పేట, మాచవరం, సంతగుడిపాడు, తదితర గ్రామాలలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు జరిగాయ. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరిగిన ఈ వేడుకల్లో పాల్గొన్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు బాలికలకు విద్యపై, ఆరోగ్యంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ అండ్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రవి నాయక్, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మొహిద్దీన్ సాహెబ్, వి.రెడ్డిపాలెం తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లలో....

నాదెండ్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, హెచ్ఎం శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ మాట్లాడుతూ, ప్రభుత్వం బాలికల విద్య కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో రెండో సచివాలయం కార్యదర్శి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు మేరి సుజాత, మల్లేశ్వరి, శివకుమారి పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేటటౌన్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాశాఖాధికారి కె.లక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని పోతవరం గ్రామంలో కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ బాలికాదినోత్స కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు గేరా యాకోబు, పి.బుల్లిబాబు, రవి, బాజీ, డాక్టర్ పీవీ సుబ్బారావు, చుక్కా విన్సెంట్‌పాల్, దార్ల బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ

వినుకొండ (నూజెండ్ల): మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై వచ్చిన అభియోగాలపై వినుకొండ క్లస్టర్ ఏపీడీ బూసిరెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. సర్పంచ్‌లకు సహకరించడం లేదని వచ్చిన ఆరోపణలపై నూజెండ్ల ఉపాధి హామీ కార్యాలయంలో కమ్మవారిపాలెం, ముప్పరాజువారిపాలెం ఫీల్డ్ అసిస్టెంట్లను విచారించారు. కార్యక్రమంలో ఏపీవో కట్టా నాగేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ప్రతిష్ట మహోత్సవం

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్ళూరు అయోధ్యస్వామి ఆశ్రమంలో మంగళవారం దేవతమూర్తుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వేద పండితులు పరుచూరి శ్రీనివాసాచార్యులు, శ్రీపతి బాలకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో యాగశాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణ చేశారు. ఆశ్రమంలో అయోధ్యస్వామి, దత్తాత్రేయ, సాయి బాబా విగ్రహాలను ప్రతిష్ఠించారు.